క్లుప్తంగా

నేడు తోటపల్లిలో మహాభిషేకం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నితాయి, గౌరంగ(శ్రీకృష్ణ బలరాం) విగ్రహాలకు మహాభిషేకంను విశాఖపట్నం హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు బి.ధనుంజయరావు, డి.పారినాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా నితాయి గౌరంగ విగ్రహాలకు నాగావళి నదిలో పుణ్య స్నానాలు నిర్వహించి మహాభిషేకంను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ఎంపీటీసీ మృతికి సంతాపం



సుశీల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కళావతి, తదితరులు

భామిని: మండలంలోని బత్తిలి-1 ఎంపీటీసీ సభ్యురాలు నిమ్మల సుశీల(65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా పార్టీకి ఆమె అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. సుశీల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, పార్టీ నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్ ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నీలయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సుమంజలి

కురుపాం: మండల కేంద్రంలోని గాంధీనగర్ వీధికి చెందిన కమిడి నీలయ్య అనారోగ్యంతో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నీలయ్య పింఛన్ లబ్ధిదారుడు కావడంతో వలంటీర్ కె.సుమంజలి శనివారం ఆస్పత్రికి వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసుకుని పింఛన్ డబ్బులు అందజేసింది. వలంటీర్ సేవాభావాన్ని గ్రామస్తులు మెచ్చుకుంటున్నారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

సీతంపేట: మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంఎంఎస్‌లో వైకేపీ సీఎఫ్‌లతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న ఎస్‌హెచ్‌జీలకు ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. సంఘాలకు వారు నిర్వహించే వ్యాపార యూనిట్లకు సంబంధించి ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందివ్వాలని సూచించారు. అలాగే తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలకు పదునుపెట్టాలి



విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

పాలకొండ రూరల్: విద్యార్థులు సమయం వృథా చేయకుండా తమ ఆలోచనలకు పదునుపెట్టాలని ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కార్టూన్ చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.మురళి సమాజంలో చోటుచేసుకున్న రుగ్మతులు, రాజకీయ, సామాజిక అంశాలకు సంబంధించిన కార్టున్లను కంప్యూటర్‌లో చిత్రించి అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు

పార్వతీపురం టౌన్: మండలంలోని నర్సిపురం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ విధానంలో పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యధికారి తిరుమల ప్రసాద్ వైద్య సేవలందించారు. చిన్నారులు, వృద్ధులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు తమ వంతు సేవలు అందించారు.

‘గడప గడప’లో ఆత్మీయత

- తాళ్లబురిడి గ్రామంలో ఎమ్మెల్యే జోగారావుకు ఘన స్వాగతం



ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడప గడపలో అర్హులకు అందుతున్నాయని అందుకే ప్రజలు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని తాళ్లబూరిడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే ప్రజలతో మమేకమయ్యారు. సంక్షేమ పథకాలైన అమ్మ ఒడి, రైతు భరోసా, పింఛన్ అందుతున్నదీ.. లేనిదీ ఆరా తీశారు. లబ్ధిదారులు పథకాలన్నీ సక్రమంగానే అందుతున్నాయని చెప్పడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అర్హులై ఉండి ఇంకా ఎవరికైనా పథకాలు అందకుంటే అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు పార్టీలకతీతంగా అందుతున్నాయన్నారు. సచివాలయాలు ఆయా గ్రామాల పరిధిలో ప్రజల చెంతనే ఉండడంతో ప్రజలకు అన్ని విధాలా సేవలు అందుతున్నాయన్నారు. సమస్యలు ఉంటే సచివాలయాల సిబ్బందికి తెలియజేసి పరిష్కరించుకుంటున్నారని చెప్పారు. సచివాలయానికి రూ.20లక్షలు ప్రభుత్వం కేటాయించిందని వీటి ద్వారా పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. నవరత్నాలతో ప్రజలకు అన్ని అవసరాలు తీరుతున్నాయన్నారు. రాష్ట్రంలో సుపరిపాలనను చూసి ఓర్వలేకే ప్రతిపక్ష నేత చంద్రబాబు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీపై సుప్రీంకోర్టు తీర్పు పచ్చ మీడియాకు, ప్రతిపక్షానికి చెంపపెట్టు వంటిదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ శిద్దా జగన్నాధరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ యాండ్రాపు తిరుపతిరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు కార్పొరేషన్ డైరెక్టర్లు, గృహ సారథులు, జేసీఎస్ కన్వీనర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల కష్టాలు తీర్చడమే ధ్యేయం



సావిత్రికి సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షపాతి అని, పేద ప్రజల కష్టాలు తీర్చడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుంటారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. బత్తిలికి చెందిన గంటా సావిత్రి దీర్ఘకాల వ్యాధితో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఆమెకు సీఎం సహాయ నిధి నుంచి రూ.2.5 లక్షలు మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే కళావతి శనివారం లబ్ధిదారుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యం కోసం డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి సీఎం సహాయ నిధి సంజీవనిలా ఆదుకుంటోందన్నారు. నాలుగేళ్లలో నియోజకవర్గంలో ఎంతో మందికి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు టింగ అన్నాజీరావు, పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.ప్రఫుల్లకుమార్, సచివాలయ కన్వీనర్లు పత్తిక దాస్, రాగోలు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు సహకరించాలి



ఆదర్శ పాఠశాలలో స్ప్రేయింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

కురుపాం: మలేరియా నివారణకు అందరి సహకారం అవసరమని ఎంపీడీఓ వి.వి.శివరామప్ప, ఎంఈఓ ఎస్.సత్యనారాయణ అన్నారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు ఆధ్వర్యంలో కురుపాం మండల కేంద్రంలోని వసతి గృహాల్లో శనివారం దోమల నివారణ మందును స్ప్రే చేయించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన స్ప్రేయింగ్ ప్రక్రియను ఎంపీడీఓ, ఎంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేయించుకోవాలని కోరారు. వారి వెంట డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సుందరరావు, సూపర్‌వైజర్ కె.రాధాకృష్ణ, రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు ఉన్నారు.

నేడు జగన్నాథుడికి జ్యేష్ఠాభిషేకం



పూజలు అందుకుంటున్న జగన్నాథుడు

పాలకొండ రూరల్: జగములనేలు జగన్నాథుని రథోత్సవానికి ఆదివారం అంకురార్పణ జరగనుంది. ఇందులో భాగంగా స్వామివారికి జ్యేష్ఠాభిషేకాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి వి.రాధాకృష్ణ శనివారం తెలిపారు. అనంతరం అర్చకస్వాములు స్వామివారి నేత్రాలను పుణ్య జలాలతో అభిషేకించి చీకటి గది లోకి చేరుస్తారు. ఈ నెల 20 నుంచి 30 వరకు జగన్న థుని రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో లడ్డూ, పులిహోరా ప్రసాద విక్రయాని కి రూ.5వేలు, జెయింట్ వీల్ ఏర్పాటుకు రూ.50 వే లు ధరావత్తుతో ఈ నెల 6న ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం వేయనున్న ట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం..

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రతిభ గల క్రీడాకారులకు నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వపరంగా ప్రోత్సహిస్తామని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమస్థానం సాధించిన పట్టణంలోని చిట్లువీధికి చెందిన బర్లి మౌళి ఉపముఖ్యమంత్రిని శనివారం ఆయన స్వగృహంలో కలిశారు.ఈ సందర్భంగా మంత్రి రాజన్నదొర మౌళిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు జర్జాపు సూరిబాబు, గిరి రఘు, పువ్వల శ్రీను, కర్రి అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లభాష నైపుణ్యతపై ప్రత్యేక శిక్షణ

- నోడల్ రిసోర్స్ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సోమవారం నుండి నెల రోజుల పాటు బ్యాచ్‌ల వారీగా పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులకు ఆంగ్లభాష పరిజ్ఞాన నైపుణ్యత పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నోడల్ రిసోర్స్ సెంటర్ ప్రిన్సిపాల్, స్థానిక ప్రభుత్వ శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోల భాస్కర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు ఆంగ్లంలో బోధనా నైపుణ్యత పెంచేందుకు, ఇంగ్లిష్ స్కిల్స్ అధ్యాపకులలో పెంచేందుకు రాష్ట్ర స్థాయిలో 18 నోడల్ రిసోర్స్ సెంటర్లలో ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న ఇంగ్లిష్ అధ్యాపకులకు, పీడీలకు, లైబ్రరియన్లకు శిక్షణ తరగతుల నుండి మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ నెల 5న ప్రారంభిస్తారని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు తప్పనిసరిగా ఆరురోజుల నాన్ రెసిడెన్షియల్ శిక్షణ తరగతులకు హాజరు కావాలని కమిషనర్ ఆదేశాలు ఇప్పటికే జారీ చేశారని తెలిపారు. శిక్షణ తరగతులకు కోర్సు కో - ఆర్డినేటరుగా కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకులు బి.శాంతకుమారి వ్యవహరిస్తారని చెప్పారు. శిక్షణలో ఆన్‌లైన్ ద్వారా కొన్ని అంశాలపై నిపుణులు శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, మరికొన్ని అంశాలపై మాస్టర్ ట్రైనర్లగా నియమించబడిన నలుగురు అధ్యాపకులు శిక్షణ ఇస్తారని తెలిపారు.

జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు ఎంపిక



పి.ప్రియమణి



ఎ.ప్రణీత



దూబ శరణ్య



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివకుమార్

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయ ప్రతిభా స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ శనివారం తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న టి.చరణ్య, గుర్జాపు కరుణశ్రీ, నిమ్మల ప్రణవి, గొడు జీతూ, గొడు జగదీష్, కొల్ల చంద్రికలు స్కాలర్‌షిప్‌కు ఎంపికై నట్లు చెప్పారు. వీరికి సంవత్సరానికి రూ.12వేలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ను అందిస్తుందన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైనట్లు ఎంఈఓ ఆనందరావు తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో పాఠశాలకు చెందిన పి.ప్రియమణి, అంజూరు ప్రణీత, దూబ శరణ్యలు ప్రతిభ కనబరిచారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులనుఎంఈఓతో పాటు హెచ్ఎం ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన జేఏసీ నాయకులు

సీతంపేట: గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషిచేస్తానని గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర హామీ ఇచ్చారని సీతంపేట ఆదివాసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి బిడ్డిక ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. గిరిజన గురుకులాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న సుమారు 1600 మంది అరకొర జీతాలతో నెట్టుకొస్తున్నారని, వారికి మినిమం టైమ్ స్కేల్‌ను అమలు చేయడంతో పాటు వారిని సీఆర్టీలుగా మార్పు చేయాలని కోరా రు. అలాగే బోయ, వాల్మీకి, బెంతోరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

చురుగ్గా భూముల రీసర్వే

పాలకొండ రూరల్: పట్టణ పరిధిలో సమగ్ర భూసర్వే శరవేగంగా కొనసాగుతోందని ఇన్‌చార్జి తహసీల్దార్ బొమ్మలాట బుచ్చయ్య అన్నారు. పట్టణ శివారులో శనివారం చేపట్టిన భూసర్వేను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతుల సమక్షంలో సర్వే చేయాలని, సర్వే వివరాల నమోదులో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సకాలంలో సర్వే పూర్తిచేయాలని సూచించారు. సర్వే సిబ్బందికి రైతులు, భూయజమానులు సహకరించాలని కోరారు. ఎక్కడైనా ఏదైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ పీ వెంకటరావు, వీఆర్వో బీ సాయిశ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గ్రామ కంఠాలను పక్కాగా గుర్తించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సమగ్ర భూహక్కు, భూ రక్ష పథకం అమలు చేయడంలో భాగంగా స్వమిత్వా పథకం ద్వారా గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామ కంఠాలను రీసర్వేలో పాల్గొనే అధికార సిబ్బందితో కలిసి పక్కాగా గుర్తించాలని తహసీల్దార్ ఎన్వీ రమణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గ్రామ కంఠాల నిర్ధారణకు చేస్తున్న రీసర్వేపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న పక్కా గృహాలు, తాత్కలికంగా ఉన్న గృహాలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించి సర్వే రాళ్లను నిర్దేశించిన ప్రాంతాల్లో వేయాలని సూచించారు. ఆరు గ్రామాల్లో రీసర్వే పూర్తయినందున ప్రజల వద్ద ఉన్న స్థల వివరాలను సేకరించి సాంకేతికపరమైన ఇబ్బందుల్లేకుండా చూడాలని కోరారు. గ్రామ కంఠాల్లో ఖాళీగా ఉన్న భూములను పరిశీలించాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



బ్రీత్ అనలైజర్ పరీక్ష చేస్తున్న ఎస్సై శివప్రసాద్

పాలకొండ రూరల్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై బి.శివప్రసాద్ అన్నారు. పాలకొండ-సీతంపేట రహదారిలో శనివారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేశారు. అలాగే లైసెన్స్, సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపేవారిపై అపరాధ రుసుం విధించారు. బహిరంగ ప్రదేశాల్లో, రహదారి కల్వర్టులపై మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

- ఊరించిన వర్షం



పాలకొండ పట్టణంలో మేఘావృతమైన ఆకాశం

పాలకొండ రూరల్: భానుడి ప్రతాపానికి ప్రజలు హడలిపోతున్నారు. గత రెండు రోజులుగా పాలకొండ పట్టణంలో సగటున 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. శనివారం ఉదయం నుంచి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా చల్లబడటంతో కొంత ఊరట లభించింది. ఆకాశం మేఘావృతం కావడంతో వర్షం కురుస్తుందని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. వరుణుడి కరుణ కోసం ప్రజలు, రైతులు ఎదురుచూస్తున్నారు.

సైక్లింగ్‌తో మెరుగైన ఆరోగ్యం



సైకిల్‌తో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారిణి ఉషారాణి

సీతానగరం: ప్రజలు సైకిలు తొక్కడం వలన రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి అన్నారు. అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం సందర్భంగా సూరంపేటలో డాక్టర్ ఉషారాణి సైకిలు ప్ల కార్డులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ సైకిలు రోజూ తొక్కడం వలన రోగ నిరోధక శక్తి పెంచుకోవచ్చని అన్నారు. గుండెకు సంబంధించిన వ్యాధుల నివారణకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపరువైజరు భవాని, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్ ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ చెరువుల పరిశీలన



అమృత్ సరోవర్ చెరువులను పరిశీలిస్తున్న ఉన్నతాధికారుల బృందం

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ సరోవర్ చెరువుల పనులను జిల్లా పర్యవేక్షణ ఇంజినీరింగ్ అధికారులు తనిఖీ చేశారని ఉపాధి హామీ పథకం జేఈ కృష్ణ తెలిపారు. కృష్ణారాయపురం, అప్పయ్యపేట చెరువులను శనివారం వారు పరిశీలించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో అమృత్ సరోవర్ పథకం ద్వారా ఎంపిక చేసిన 6 చెరువులను ప్రభుత్వం ప్రత్యేకించి నియమించిన ఎస్ఆర్ఈజీఎస్ ఏపీడీ, ఇద్దరు డీఈలు, ఒక సామాజిక తనిఖీ డీఆర్పీలతో కమిటీ ప్రతినిధులు పరిశీలించారని పేర్కొన్నారు. చెరువుల పనులు పూర్తవడంతో జిల్లా అధికారులు పరిశీలన పూర్తయిందని, ఆగస్ట్ 15లోగా కేంద్ర ప్రభుత్వం నియమించిన పరిశీలన బృందం నిర్దేశించిన చెరువులను సందర్శించనుందని అన్నారు. చేసిన పనులను పరిశీలించిన ఉన్నతాధికారులు వేతనదారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో చెరువుల అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీఓ భాను, టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన సముపార్జనకే టీఎల్ఎం సదస్సు

సీతానగరం: నిపుణ్ - భారత్ - జన్ భగీరథ ప్రదర్శనలో భాగంగా ఎఫ్ఎల్ఎన్ ఎగ్జిబిషన్ (టీఎల్ఎన్) మండల స్థాయిలో ఎంఈఓ జి.సూరిదేముడు ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ నిపుణ్ - భారత్ - జన్ భగీరథ పథకం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానాన్ని గుర్తించడానికి, విజ్ఞానాన్ని పెంపొందించడానికి దోహద పడుతుందన్నారు. ఎగ్జిబిషన్‌లో మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, 3, 4, 5 తరగతుల నుండి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.